కథానిక

# అధికారం

శ్రీ తటవర్తి

బి. ఏ. పరీక్షలో యూనివర్సిటీ ఫస్టు రాంకు సంపాదించాను. ఇతోధిక విద్యాసముపార్జనకి అభిలాష ఎంతో ఉంది. అయితే, సంసారభారం అవరోధం కలిగించింది. నౌకరికి దరఖాస్తు పెట్టాను. ఫిర్కా సప్లయి ఆఫీసరుగా నియమింపబడ్డాను. కుటుంబాన్ని వెంటపెట్టుకొని వెళ్లి కొండాపురంలో మకాం పెట్టాను.

కొండాపురం అధికంగా వరిధాన్యం పండించే తాలూకా. జిల్లా అధికార్లు ఎక్కువ ధాన్యసేకరణ చేయవలసిందని నన్ను హెచ్చరిస్తూ ఉండేవారు. ఆ సంవత్సరం తుపానువల్ల వరిపంట బాగా దెబ్బతింది. రైతులు తిండికీ పెట్టుబడికీ చాలక ఎంతో బాధపడుతూ ఉన్నారు. నేను తాలూకా అంతా తిరుగుతూ ప్రజలవద్దనుంచి ధాన్యం సేకరిస్తూ ఉన్నాను. రైతులు ముందుగా నిరాకరించినా, చివరికి ధాన్యం ఇచ్చేవారు. అందుచేత నా గౌరవప్రపత్తులకు లోటు లేకుండా, పై ఆఫీసర్ల తిట్లు తినకుండా, నా కర్తవ్యం నేను నిర్వహించుకుంటూ కాలం గడుపుతున్నాను.

మా తాలూకానుంచి ఇంకో ఇరవై వేలబస్తాలు సప్లయి కావాలని మళ్లీ పైనుంచి తాఖీదు వచ్చింది. మొన్నే అంత ప్రోగుచేసి యిచ్చాం; మళ్లీ యీ తాఖీదు. నాకీసారి - యీ ఆర్డరు చూడగానే భయం వేసింది.

అయినా ఎందుకేనా మంచిదని, యీసారి తాలూకా సప్లై ఆఫీసరు, తహసీల్దారు ఇంకా సిబ్బందిని వెంటబెట్టుకొని గ్రామాలమీద పడ్డాము. మా రాక ప్రతి గ్రామంలోనూ చాలా అలజడి కలిగించింది. ఇది నేను స్పష్టంగా గుర్తించాను. అయితే నా చేసేది మాత్రం ఏముంది! ఇదివరలో ధాన్యం ఇచ్చినవాళ్లనే మళ్లీ కలుసుకొన్నారు. వాళ్లు స్పష్టంగా ఇంక ఇవ్వలేమని చెప్పివేశారు. అదీ నిజమే. వాళ్ల దగ్గర ఉంటేకదా వాళ్లివ్వడానికి? ఇవ్వగలిగింది ఇదివరలోనే ఇచ్చివేశారు. ఇంక ఇప్పుడు వాళ్లదగ్గర ఏమీ లేదని చెప్పివేశారు.

అది చిన్న పల్లెటూరు. గ్రామమునసబు శరభయ్య మమ్మల్ని ఆహ్వానించాడు. ఎంతో గౌరవంచేశాడు. మా ఆగమన కారణం చెప్పి, రైతులను పిలిపించమన్నాము.

కొద్దిమందే వచ్చారు. మునసబు వాళ్లకి మా రాకకారణం చెప్పాడు. వాళ్లు నిరాకరించారు. ఇవ్వక తప్పదన్నాను నేను.

"ఏం చేస్తాం. మావద్ద గింజలేదు. మీకు కంట్రోలురేటుకు ఇచ్చివేశాము. మీరు పుచ్చుకొన్నారు. మళ్లీ కొందామంటే ఏ డీలరూ మిల్లువాళ్లూ మాకు కంట్రోలు రేటుకు అమ్మరు."

"ఇవన్నీ మాకు తెలియదు. యీ గ్రామం మొత్తానికి మాకు నూట యాభై బస్తాలు సప్లయిచేసి తీరాలి. మీ రివ్వకపోయినా మేము పుచ్చుకోకుండా వెళ్లము." అన్నాడు తహసీల్దారు.

"మీ రధికారులు. మీ యిష్టం వచ్చినట్లు చేయగలుగుతారు. పోలీసులద్వారా మా ధాన్యం—మా ప్రాణాలు కూడా పట్టుకుపోతారు. ఇంతకన్నా ఏం చేస్తారు?" అన్నాడు రమణయ్య.

"మా డ్యూటీ మేము......"

"డ్యూటీ అంటారు నిజమే. డీలరుచేత మిల్లర్సుచేత సీలింగురేటు కమ్మించడం మీ డ్యూటీ మాత్రం కాదండీ? అక్కడ మీ రేమీ మాట్లాడరు."

"వాళ్లు సరైన ధరకే, అమ్ముతున్నారు. వాళ్ల రికార్డునిబట్టి తెలుస్తోందిగా."

"రికార్డు! కంట్రోలుధరకే మాకు రసీదు. మూడురెట్లు ఎక్కువగా పుచ్చుకొన్నా సొమ్ముకు రశీదివ్వరు."

"అయితే కొనకండి"

"అయితే చావండి అని అర్థం. ఏదో విధంగా బియ్యం తెచ్చుకోకపోతే వీల్లేదుగదాండి—తిండి లేకుండా ఏ ప్రాణి—అంచేత వాళ్లెంత ధర చెప్పినా కొనుక్కొని తీరవలసిందే. వాళ్లు చేసే అన్యాయవర్తన పరిశీలించడానికి మీకు మనస్సు రాదు. ఆ ప్రక్కకైనా చూడరు."

"నీ కిది అనవసరం—మాపని ధాన్యసేకరణ. ఇప్పుడు దానిమాటే చెప్పండి. అంతే. మిల్లువాళ్ల విషయంలో—డీలర్ల విషయంలో మీరు కాగితంమీద వ్రాసుకుని పంపండి. మేము విచారిస్తాము."

"చల్లనిమాట సెలవిచ్చారు, ప్రభువులు."

"మునసబూ, లిస్టు వ్రాయి—ఏ రైతెంతెంత ధాన్యం ఇవ్వగలడో, మా డ్యూటీ మేము చేసి తీరవలసిందే—" అన్నాడు తహసీల్దారు కొంచెం రూక్షణంగా.

"ఇదివరలోనే మనవిచేశాను. ఇది చాలా బీదగ్రామమండి. అంతా కూలిపని, పాలేరుతనంమీద బ్రతుకుతున్నారండి." అన్నాడు మునసబు—తప్ప తప్పగా.

"ఇల్లా నువ్వు చెప్పకూడదు. నువ్వు గవర్నమెంటు తాబేదారువి. మాతో రా. ప్రతీయిల్లూ చూద్దాం."

"చిత్తం మీ రధికారులు. నేను తాబేదారుణ్ణి"

"బాబూ, లేనివాళ్ళని మమ్మల్ని బాధించకపోతే, ఆ ప్రక్కఊళ్లో అంతంత ధనికు లున్నారు. అంత బ్లాకుమార్కెట్టు నిర్భయంగా సాగిస్తున్నారు. అక్కడ మీకు కావలసినంత ధాన్యం దొరుకుతుంది గదా వెళ్లకూడదండీ" అన్నాడు రమణయ్య.

"నీ సలహా మేము కోరడంలేదు. నోరుముయ్యి. మీ నాటకమంతా మాకు తెలుసు" అన్నాడు. టి. యస్. ఓ.

తహసీల్దారుతోపాటు మేమంతా ఊళ్లోకి బయలుదేరాము. అవన్నీ పూరిళ్లే. నాలుగైదు పెంకుటిళ్లు మాత్రమున్నాయి. ముందుగా అక్కడికే వెళ్లాము తిన్నగా.

ఇంట్లోకి వెళ్లి నేను, తహసీల్దారు, మునసబూ ఇల్లంతా శోధించాము. ధాన్యం ఎక్కడా కనిపించలేదు. వంటగదిలో ఒకటి రెండు బియ్యంమూటలు కనిపించాయి. అవే ఇమ్మని అడిగాము.

ఆయింటి యజమాని కోటయ్య 15 రోజులనుంచీ జబ్బులో ఉన్నాడు. మెల్లగా అతనిదగ్గరకే వెళ్లి మునస బడిగి వచ్చాడు. కోటయ్య లేచి కర్రమోపు కుంటూ మెల్లగా అరుగుమీదకు వచ్చి కూర్చున్నాడు.

"ఏమయ్యా! గవర్నమెంటువారికి ధాన్యంగాని బియ్యంగాని సప్లయి చెయ్యాలి. ఏమంటావు. నీ వంతు ఎంత ఇస్తావు" అన్నాను నేను—అతడిని అడగడం ఇష్టం లేకపోయినా, తహసీల్దారు ఏమనుకొంటాడో అని.

"బాబయ్యా నా యింట్లో ధాన్యం లేదు. మీరు తనిఖీచేసుకొన్నారు గదాండి. ఆ బియ్యంకూడా బోలెడుధర పెట్టి కొనుక్కొని ఉంచుకొన్నాను. నెలరోజునుంచి నేను ఖాయిలా—లేవలేను. ఇంట్లో ఇంకో మగదక్షత లేదండి. పెద్దమ్మాయి పురిటికి వచ్చింది. ఇంకా నాల్గు నెలల దాకా క్రొత్త గింజలు రావు. అంతవరకెల్లాగ జీవించేది? ప్రభువులు మీరే సెలవియ్యండి" అన్నాడు కోటయ్య నీర్సంగా.

"నిజమే. కాని నీ కన్నా ఒడిదుడుకు వచ్చింది సర్కారుకి. నీ స్థితి చూస్తే జాలి వేస్తోంది. అయినా మేము ఊరుకుంటే—మాపని జరగదు కోటయ్యా. అందుకని ఒక్క బస్తా ఇయ్యి. అంతే." అన్నాడు తహసీల్దారు.

"పోనిద్దురూ. ఇంకో చోటికి పోదాం. వీడిని పీడించవద్దు"ని ఇంగ్లీషులో చెప్పాను నేను తహసీల్దారుతోను, టి.యస్. ఓ.తోను. వాళ్లిద్దరూ నామీద మండిపడ్డారు "ఇల్లా జాలి తలుస్తూ ఉంటే మనం ధాన్య సేకరణ చేసినట్లే. నీ ఉద్యోగానికి నీళ్ళు వదులుకోవలసిందే. అయినా రైతులు బలే తమాషా చేస్తారులే. ఎక్కడో ధాన్యం దాచుకుని ఉంటారు. మనదగ్గర కల్లబొల్లి ఏడ్పులు ఏడుస్తారు. నీ కింకా అనుభవం తక్కువ" అన్నాడు తహసీల్దారు. ఆ ఘోర జిలోనే టి. యస్. ఓకూడా ఉరిమాడు. నే నేమీ మాట్లాడలేకపోయాను.

"ఏమంటావు! సరసంగా ఒక బస్తా బియ్యం ఇస్తానంటావా—బలవంతంగా అంతా పట్టుకుపొమ్మంటావా?" అని గద్దించాడు కోటయ్యని టి. యస్. ఓ.

"బాబయ్యా, అట్టే మాట్లాడలేను. ఆయాసంగా ఉంది. నిజంగా లేనివాణ్ణం. మమ్మల్ని పీడించకపోతే నిజంగా ఉన్న వాళ్లవద్ద వసూలు చెయ్యకూడదూ."

"అందరిదగ్గరా వసూలు చేస్తాము. మానము. నువ్వూ—"

"అయితే విమర్శలేని మీరంతా దానవులేమో—"

"నోరు సంబాళించు కోటయ్యా" అన్నాడు మునసబు కంగారుపడుతూ—.

"ఎందుకని.! ఏమి చేస్తారని?...ఇంతకంటే?"

"మున్సబూ జాబితా వ్రాయి. కోటయ్య ఒక బస్తాబియ్యం..."

"సార్, నిజంగా ఇతడు కటికిదరిద్రుడు. ఇల్లు తాకట్టుపెట్టి ఆ రెండు మూటలు బియ్యం కొనుక్కొని ఉంచుకొన్నాడు. వీళ్లు చాల బాధలో ఉన్నారు." అన్నాడు మున్సబు - మెల్లగా.

"వీళ్లు బాధలో ఉన్నారు. మున్సబు సప్లయిచేయకపోతే—మాకూ బాధలే"

మునసబు, నేనూ నిర్విణ్ణులై చూస్తూ ఊరుకొన్నాము. తప్పదు ఇవ్వాలంటూ లిస్టు వ్రాసుకొని అంతా ఇంకొక ఇంటికి వెళ్లాము.

ఆ గ్రామంమొత్తంమీద ఇల్లాగే అతి కష్టంమీద ఏడుబస్తాలు బియ్యం పోగు చేశాము బలవంతంగా. అందరి దీనస్థితీ ఒకలాగే ఉంది. వాళ్ల సంసారాలు, వాళ్లు పడేబాధలూ చూస్తే ఎటువంటివాడికైనా గుండె నీరవుతుంది.? నాకు వాళ్లమీద ప్రేమ—సానుభూతి ఉంటేమాత్రం ఏం లాభం? నేను ఏమిచెయ్యగలను!

౨

మర్నాడు ఇంకో ఊరు వెళ్లాం. ఆ వూళ్ళో అందరూ మంచి స్థితిపరులే. ముప్ఫయి, నలభై యెకరాల స్వంతభూమి గలవాళ్లే. ఒకరిద్దరికి వందలకొద్దీ ఎకరాల భూమి ఉంది. మేము తిన్నగా మున్సబు ఇంటికి వెళ్లాము. మున్సబు పెద్ద సంపన్న గృహస్థు. మమ్మల్ని అందరినీ బాగా గౌరవించాడు రకరకాల పిండివంటలూ—పాలూ పెరుగూ—పళ్లతో భోజనం పెట్టాడు.

తహసీల్దారుగారు సిబ్బందితో ధాన్య సేకరణకు వచ్చారని తెలిసి అందరూ మునసబింటికి చేరారు. ప్రొక్యూరుమెంటుకు వచ్చామని, యీ గ్రామంనుంచి కొన్ని వందలబస్తాలు ఆశిస్తున్నామని తహసీల్దారు అందరితోనూ చెప్పాడు.

పెద్దరాజుగారు స్పష్టంగా రెండుమాటలతో చెప్పివేశారు—ఇవ్వవలసిందీ, ఇవ్వగలిగిందీ ఇదివరలోనే ఇచ్చివేశారనీ, ఇంకిప్పుడివ్వలేరనీ—ఇవ్వరనీ.

తహసీల్దారు, "అల్లాగనకండి. మామాట కూడా దక్కించాలి. తప్పదు." అన్నాడు. ఆ బ్రతిమాలడం చూస్తే నాకాశ్చర్యం వేసింది. నిన్న ఆ గ్రామంలో ఆయన అధికారం అంతా వొలకపోశాడు. వాళ్ళ నోటి ముందు ఆహారం లాక్కునివచ్చాడు.—ఉగ్రుడై ఉరిమి ఏమీ లేనిచోట ఏడు బస్తాలు బియ్యం పుట్టించాడు. మరి ఇదేమిటిక్కడ? వేలకొద్దీ ధాన్యం బస్తాలు కొట్లలో మూలుగుతూ ఉంటే, బ్రతిమాలడమా? ఇవ్వమని స్పష్టంగా చెప్పుతున్నా బ్రతిమాలడ మెందుకు? తహసీల్దారు, టి యస్. ఓ.ల మానం నన్ను భావాన్ని ఉద్రేక పరచింది. అయినా మెల్లగానే అన్నాను.

"ఇవ్వాలి. తప్పదండీ. అంత స్థితిపరులు మీరే ఇవ్వనంటే ఇంకెల్లాగ? తప్పదు"

"తప్పదు? తప్పదాఅండి? అయితే మాయిష్టం— మే మివ్వం. ఒక్కబస్తా కూడా ఇవ్వ. చేయండి ఏమి చేస్తారో?" అన్నాడు పెద్ద గొంతుకతో పెద్దరాజు.

నాకూ పట్టుదల హెచ్చింది. "ఏమి చేస్తామా? మాపని మేము చేస్తాం. గాదులికీ-కొట్లుకీ సీళ్లు వేస్తాం-అంతే" అన్నాను.

"అల్లాగా! ఏదీ కానియ్యి! అదీ చూస్తాం. నీ అధికారబలం ఏమాత్రం వుందో నేను చూస్తా. పడుచుతనం - కుర్రతనం ఎగుడు-పాటు" అని నవ్వాడు పెదరాజు.

ఆ పెదరాజు ఇంత దురుసుగా-కఠోరంగా మాట్లాడినా, అక్కడ ఎవ్వరూ కాదని అడ్డుకున్నవాళ్లు లేకపోయారు. చివరికి తహసీల్దారు, టి.యస్. ఓలుకూడా నోరెత్తలేదు. ఎందుకీ ఔదాసీన్యత-భయమా? నా శరీర మాపాదమస్తకం భగ్గుమంది. "తహసీల్దారుగారూ, సీళ్లు వేయండి. వీళ్ళేమి చేస్తారో చూద్దాం" అన్నాను ఇంగ్లీషులో.

"ఊరికో వీళ్లు చాలా సంపన్నులు. బాగా పెంకివాళ్లు. మన పై ఆఫీసర్లు, ఆ పై ఆఫీసర్లు వీళ్లకి దగ్గరచుట్టాలు. మన ఆటలు చెల్లవు. అందుకని బ్రతిమాలుతున్నాను. ఇస్తే ఇస్తారు. లేకపోతే పోదాం" అని సమాధానం చెప్పాడు తహసీల్దారు.

నాకింకా వళ్లు మండింది - "అయితే ప్రొక్యూరుమెంటు మనం చేసినట్లే-మీరల్లా

(35-వ పేజీ చూడుడు)

# అధికారం

(15 వ పేజీ తరువాయి)

ఊరుకోండి నేను మాట్లాడతాను" అంటూ, తహసీల్దార్ ఏదో జవాబు చెప్పబోతూవుంటే వినిపించుకోకుండా - పెదరాజుతో - "మా డ్యూటీ మేము చేసితీరవలసిందే-లేక మున్సబ్. చూచి-తాళాలు వేసివద్దాం" అన్నాను. నాకు హక్కు ఎంత వుందో గుర్తించాను.

పెదరాజు చిందులు త్రొక్కుతూ కఠోరంగా శాసించాడు.

"మున్సబూ, నువ్వుకాని, 'యీ పెద్దమనిషిగాని, లేదా తహసీల్దారు - కలెక్టరు కాని ఇంతటితో విరమించి మంచిగా గౌరవంగా వెడతారా సరే, లేదా మీ డ్యూటీ ప్రకారం మీ అధికారబలం చూపించాలని అనుకుంటూ అల్లాచేస్తారా సరే మీ యిష్టం. ఏ మొగాడు వచ్చి సీలు వేస్తాడో వెయ్యమను నా తడాఖా చూద్దురుగాని" అతని మొఖం కందగడ్డలా అయింది. మాటా శరీరం వణుకుతున్నాయి.

తహసీల్దారు - టి. యస్. ఓ. కంగారుపడ్డారు. కులాసాగా ఇంటికి చేరతామా లేదా అని భయపడ్డారు. కాని నాకుమాత్రం భయం కలగలేదు. ఏం చేస్తారు? కొడతారా సానబలమా? అదీ చూద్దామని నా ఉద్దేశ్యం.

"తహసీల్దారుగారూ పోలీసుకు వ్రాయండి. ఎస్కార్టు వచ్చిపడుతుంది. అప్పుడు ఎవళ్ల డ్యూటీ వాళ్లు-" అన్నాను.

పెదరాజు గర్జించాడు- పోలీసు వచ్చినా- మిలిటరీ వచ్చినా మాకేమీ భయంలేదు. యీ లోగా మీ అవస్థ కాస్త ఆలోచించి మరీ దిగండి రంగంలోకి. నిన్నకాక మొన్న వచ్చావు ఉద్యోగంలోకి. అప్పుడే ఇంత పవరు వెలగబెడుతున్నావు. అందులో నా ముందర!

నే నేమనాలో తెలియడంలేదు. తహసీల్దారు టి. యస్. ఓ. కళ్లప్పగించి చూస్తున్నారు. మా డఫేదార్లు, ఇంట్లో కూర్చుని టిఫిన్లు మెక్కడంలో నిమగ్నులై ఉన్నారు.

"ఇదివరలో నే ఇచ్చాం ఇవ్వవలసిందీ, ఇవ్వగలిగిందీని. మీకు తోచినప్పుడల్లా వస్తూవుంటే మేమిస్తూ ఉండవలసిందేనా? ఎన్నిసార్లని? ఎంతని? ఇదివరలో ఇచ్చిచూచాము. ఇప్పుడివ్వక చూస్తాము. ఏం జరుగుతుందో పర్యవసానం."



ఆగస్టు 15-వ తేదీన అధ్యక్షుడు సోకర్నో ఇండోనిషియాను సమైక్య రిపబ్లికన్ రాజ్యాంగంగా ప్రకటించారు.

తహసీల్దారు కొంచెం తేరుకొన్నాడు. పెదరాజుతో అతివినయంగా - మృదువుగా చెప్పాడు. "పెదరాజుగారూ, మేము సరదాకోసం వస్తామా? అవతల రోజురోజూ మాకు నోటీసులే, ఇంకా సేకరించమని. అంచేత-"

"రైతులివ్వలేరనీ ఇవ్వడంలేదనీ స్పష్టంగా వ్రాయండి - అంతే."

"అల్లా వ్రాస్తే అది మా అసమర్థతగా భావించి మమ్మల్ని అంతులో పెడతారు."

"రెండూ కావాలంటే అనుభవించండి మీ కర్మం. మే మేమీ యివ్వం. నేనే కాదు, మా గ్రామంలో ఎవ్వరూ ఇవ్వరు. ఇవ్వనియ్యను. వెళ్లండి. మీయిష్టం వచ్చినట్లు చేసుకోండి."

# వార్తాపత్రికల పుట్టుక

వార్తాపత్రికలు రెండువిధాల ప్రారంభమైనాయి: మహారాజుల ప్రచారానికి, వర్తకులకు సమాచారం తెలుపుతూ ఉండడానికి.

మొట్టమొదట రోమన్ సామ్రాజ్యంలో 'కోర్ట్ జర్నల్ ఆఫ్ అగస్టస్' హస్తలిపిలో వచ్చింది. కొంతమంది కూచుని వ్రాసి, ప్రతుల్ని రోమన్ సామ్రాజ్యంలో కల నగరాలన్నిటికీ పంపేవారు. దానిపేరు 'నేటి సమాచారం.'

తరువాత చీనా చక్రవర్తులు ఈ పద్ధతిని అనుకరించి, పెకింగ్ గెజెట్‌ను క్రీ. శ. 618 నుంచి 1912 వరకూ నడిపారు.

వర్తకుల సమాచారపత్రాలు పదహారో శతాబ్దంలో ఆంట్వెర్ప్, హాంబుర్గ్, వెనిస్ నగరాలలో వెలువడ్డాయి. మువ్వావు పెన్నీకి వెనిస్‌నగరం 1536 లో ఒక వారపత్రిక ప్రారంభించింది. దాన్ని గెజెట్ అన్నారు.

1639లో ఛార్లెస్ I ప్రోత్సాహంపైన బట్లర్ అనే బ్రిటిష్ సంపాదకుడు ఒక వార్తాపత్రికను లండన్‌లో స్థాపించాడు. అయితే అది రాజుగారి కఠిన నిర్బంధాలకు లోబడి నడిచేది. ఆ పత్రికకు చందా ఏడాదికి పది పౌనులు. ఇలా వచ్చిన ధనంతో సెంట్ పాల్స్‌చర్చి మరమ్మతుచేయించారు. ఆతరువాత బట్లర్ ఆక్స్‌ఫర్డ్ గెజెట్ స్థాపించి, 1642 లో కెవెలియర్ కేసు చేపట్టాడు.

1695 వరకూ అన్ని వార్తాపత్రికలూ లైసెన్సు పొంది, సెన్సార్‌కి లోబడే ఉండేవి.

మరుచటి సంవత్సరం లాయిడ్స్ బాంక్‌కి చెందిన లాయిడ్స్ స్వతంత్రించి వారానికి మూడు పత్రికలు ప్రచురించాడు.

మొట్టమొదటి దినపత్రిక 'ది డెయిలీ కొరాంట్' 1702 లో స్థాపించబడింది. ఆదివారపు పత్రికలు 1780 లో ప్రారంభమైనాయి. 'అబ్జర్వర్' అనే పత్రిక 1794 లో ప్రారంభించబడింది.

1712 వ సంవత్సరానికే సాలీనా 44 వేల ప్రతులు వచ్చేవి. అంటే బ్రిటన్‌లో అప్పటికే నూరుమందికి ఒక పత్రిక చొప్పున వచ్చేదన్నమాట. అందువల్ల మార్ల్‌బరో జరిపిన యుద్ధాల ఖర్చుకిగాను ప్రభుత్వం పత్రికలమీద పడింది. పత్రికల్లో ఒక్కొక్క కాగితానికి (రెండు పుటలు) పెన్నీ చొప్పున స్టాంప్ డ్యూటీ విధించారు.

జ్ఞానంపై పన్ను విధించి, అజ్ఞానంలో ప్రభుత్వం పాలుపంచుకునే విధానం 1855 వరకు ఉంది. ఆ పన్ను తీసివెయ్యగానే అన్ని పత్రికల సాలీనా అమ్మకాలు కలిసి మొత్తం 8 కోట్ల 90 లక్షలనుంచి 12 కోట్ల 20 లక్షలకు పెరిగాయి.

అప్పటికి టోరీపక్షం తరఫున "స్టాండర్డ్" పత్రిక సాయంకాల పత్రికగా ప్రారంభమై, కాథలిక్ ముక్తి ఉద్యమాన్ని ప్రతిఘటించింది. "టైమ్స్" పత్రిక 1788 నుంచే ప్రారంభమయింది.

1846లో ప్రారంభమైన "డెయిలీ న్యూస్" పత్రికకు నవలా రచయిత ఛార్లెస్ డికెన్స్ మొదటి సంపాదకుడు.

వార్తల్తోపాటు చిత్రాలుకూడా ప్రచురించిన మొట్టమొదటి పత్రిక డెయిలీ గ్రాఫిక్ (1890). కాని అప్పటికే చిత్రాల్ని ప్రచురిస్తున్నది. "లండన్ న్యూస్" వారపత్రిక 1846 నుంచి వచ్చేది.

పార్లమెంట్‌లో చర్చలు 1771 నుంచి ప్రచురించబడుతూ వచ్చాయి. అప్పుడు డాక్టర్ జాన్సన్ రిపోర్టర్ల గాలరీలో కూచుని "విగ్ కుక్కల్ని" దుయ్యబట్టేవాడు. [బర్మాషెల్ న్యూస్ నుంచి]

---

నాకు పెద్దరాజుమీదకంటె తహసిల్దారు, టి. యస్. ఓ. లమీద పెద్ద కోపంవచ్చింది. నిన్న ఆ బీదగ్రామంలో అల్లాఉగ్రులై ఊరిమారే. ఇక్కడ పిల్లిపిల్లలైపోయా రెందుచేత? పల్లెలో నిరుపేదల ముందు చూపే అధికారం ధనవంతులముందు ఉపకరించదా? ఉపయోగించినా ప్రయోగించరా? ఇందులోని రహస్యం నాకు బోధపడలేదు.

పెదరాజుపలుకులలోని పారుష్యత, మొండితనం నా కెంతో కష్టం కలిగించాయి. అయితే ఏమిటి చేసేది? నిన్న ఆ వూళ్ళో ఆ నిరుపేద, ముదుసలి, రోగి, అల్లాఅన్నాడు. ఇవ్వాళ ఇక్కడ యీ సంపన్నుడిల్లా తిరస్కరించాడు. నిరుపేదవానివద్దనుండి వసూలు చేయకుండా ఉండలేకపోయాము, మనస్సులో ఎంత బాధపడినా - ఉన్నవాడికద్ద నుంచి వసూలు చెయ్యలేకపోయాము. చెయ్యాలని ఎంత పట్టుదలగా ఉన్నా— అధికారం! మానవప్రకృతి!

శవదహనంచేసి తిరిగివచ్చినట్లు మౌనంగా శాంతంగా ఇంటికి తిరిగి వచ్చాము.

నేను రెండురోజు లిల్లుకదలలేదు. మనస్స్థిమితం లేక ఆఫీసుకువెళ్లడం మానివేశాను. పెదరాజు ఈసడింపు అవహేళన, నిరాదరణ ఇంకా చెవుల్లో మ్రోగుతూనే ఉన్నాయి.

నాలుగోరోజున పోస్టుమేన్ టెలిగ్రాం అందించాడు. అందులో— "అసమర్థుడవని అసభ్యుడవని ప్రజలను బాధించేవాడివని, నిన్ను గుర్తించి, ప్రభుత్వం నీకు డిస్మిసు ఆర్డరు దయచేసింది" అని ఉంది.

తహసీల్దారుకు చూపించాను. ఆయన ఆశ్చర్యపడలేదు. "ఆ పెదరాజంతటివాడని హెచ్చరించినా నీవు గ్రహించలేకపోయావు. ఫలితం నా కప్పుడే తెలుసును. నీకుమాత్ర మిప్పుడు తెలిసింది. బోధపడింది - అంతే" అన్నాడు.

---

## మన దేశం

(7-వ పేజీ తరువాయి)

ఉండదనుకోవచ్చును.

ఇదిగాక కాంగ్రెస్ నిర్మాణంలో అనేక లోపాలు కానవచ్చాయి. వీనిని సవరించడానికి గత సంవత్సరం కాంగ్రెస్ అధిపతులుగా అనుభవంపొందిన పట్టాభి, వెంకట్రావుగార్లనీ పాటిల్‌గారినీ ఒక సబ్ కమిటీగా నియమించారు.

కొత్తగా ఎన్నికైన టాండన్ గారు సచ్చరిత్రులు. పట్టుదల అధికం. హిందీ భాషాభిమానులు. భాషారాష్ట్రనిర్మాణానికి వ్యతిరేకులు. రవంతైనా అవినీతిని సహించజాలని టాండన్‌గారు కాంగ్రెస్‌ని ఎంతవరకూ సంస్కరించగలరో చూడవలసి ఉంది. [సీతారామ్]

---

కాశ్మీర్
అన్నిదగ్గులకు అమోఘమైనది
రాజమండ్రి